క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టూటౌన్ : మైనార్టీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు సోమవారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసినవారిలో మోర్చా జిల్లా అధ్యక్షుడు సయ్యద్ పాషా, మహేష్, జావిద్, షోయబ్ తదితరులు ఉన్నారు.

నర్సరీల పరిశీలన

చండూరు : చండూరు మండల పరిధిలోని ఇడికూడ, పుల్లెంల గ్రామాల్లో నర్సరీలు, క్రీడా ప్రాంగణాలను ఎంపీడీఓ యాకూబ్ నాయక్ సోమవారం పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలకు నీళ్లు సరిగ్గా పోసేలా కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షణ చేయాలన్నారు.

చేనేత సెల్ రాష్ట్ర కో కన్వీనర్‌గా వెంకటేశం

నల్లగొండ టూటౌన్ : బీజేపీ చేనేత సెల్ రాష్ట్ర కోకన్వీనర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన మిర్యాల వెంకటేశం నియమితులయ్యారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మిర్యాల వెంకటేశం మాట్లాడుతూ చేనేత కార్మికుల హక్కుల సాధన, వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పత్తికి మద్దతు ధర ఇవ్వాలి

చండూరు : పత్తికి క్వింటాలుకు మద్దతు ధర రూ.12 వేలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శి మోగుదాల వెంకటేశం, జెర్రిపోతుల ధనంజయగౌడ్ సోమవారం చండూరు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడులు, పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామాల్లో దళారుల, కమీషన్‌దారుల దోపిడీ నుంచి రైతులను రక్షించాలని కోరారు. పత్తికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు చిట్టిమల్ల లింగయ్య, గౌసియా బేగం, కొత్తపల్లి నరసింహ, భిక్షమయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వలను శుభ్రం చేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : మండలంలోని వల్లభాపురం గ్రామంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్ రావు సోమవారం పర్యటించారు. ప్రతి వీధి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, ఉప సర్పంచ్ నయీమ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం




ఉపాధ్యాయురాళ్లను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

కట్టంగూర్ : భారత కోకిల సరోజిని నాయుడు జయంతి పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల కేంద్రంలోని సాందీపని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను పాఠశాల హెచ్ఎం రాములు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గట్టిగొర్ల యాదగిరి, మాంద్ర సంపత్, నిమ్మనగోటి వెంకటప్రసాద్, శంకర్, నాగమణి, పద్మ, రేణుక, మంగమ్మ, సరిత, అనిత, పూజ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఇంగ్లిష్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని జీవీ.స్టెల్లా ఇంగ్లిష్ భాష నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం వరంగల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంగ్ల భాషపై రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా స్టెల్లా ప్రథమస్థానంలో నిలిచి బహుమతి గెలుచుకుంది. విద్యార్థిని స్టెల్లాను ప్రధానోపాధ్యాయుడు భిక్షమయ్య, ఉపాధ్యాయ బృందం మంజుశ్రీను తదితరులు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న స్టెల్లా

శిథిలావస్థలో పాఠశాల భవనం

- ఇబ్బందులు పడుతున్న వెంబావి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు
- భవనం కూలుతుందేమోనని ఆందోళన

చిట్యాల : ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ మన ఊరు– మన బడి కార్యక్రమాన్ని చేపడుతోంది. అందులో భాగంగా పలు పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతోంది. అ యితే చిట్యాల మండలంలోని అనేక పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోయినప్పటికీ మన ఊరు– మన బడి కార్యక్రమం కింద ఎంపిక చేయలేదు. మండలంలోని వెంబావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశా ల శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ మరమ్మతులకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రమాదపు నీడలో, సరైన మౌలిక వసతులు లేని పరిస్థితుల్లో విద్యార్థుల చదువులు కొనసాగుతున్నాయి.

పెచ్చులూడుతున్న పైకప్పు..

ఇటీవల నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైన వెంబావి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి దారుణంగా ఉంది. ఈ పాఠశాలలో సుమారు ఇరవై రెండు మంది విద్యార్థులు, ఓ ఉపాధ్యాయురాలు ఉన్నారు. ఈ పాఠశాల పైకప్పు పెచ్చులు ఊడి ప్రమాదకరంగా ఉంది. అంతేకాకుండా గోడలకు పగుళ్లు వచ్చాయి. గట్టిగా వర్షాలు పడితే పాఠశాల కూలిపోయే స్థితిలో ఉంది. అయినప్పటికీ ఈ పాఠశాలను 'మన ఊరు–మన బడి'కార్యక్రమంలో అభివృద్ధి చేయడానికి ఎంపిక చేయలేదు. దీంతో ఈ పాఠశాల భవనం ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హడలిపోతున్నారు. మరికొందరు పక్క గ్రామంలోని పాఠశాలకు తమ పిల్లల పంపుతున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు టాయిలెట్ సౌకర్యం ఉన్నప్పటికీ, ఉపాధ్యాయులకు ఎలాంటి వసతి సౌకర్యం లేదు. దీంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంబావి పాఠశాలను 'మన ఊరు–మన బడి'కార్యక్రమంలో ప్రాధాన్యతనిచ్చి, నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం



పైకప్పు పెచ్చులూడిన పాఠశాల భవనం

పలు పాఠశాలల్లో..

- మండలంలోని ఎలికట్టె గ్రామంలోని దళిత వాడలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చుట్టూ పూర్తిస్థాయి ప్రహరీ నిర్మించలేదు. కంపచెట్లు పెరిగిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- చిట్యాల పట్టణంలోని ముత్యాలమ్మగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు సరైన దారిలేదు. దీంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల సమీపంలో మిషన్ భగీరథ నల్లాల నుంచి లీకేజీ అయిన నీరు పాఠశాల ముందు నుంచి వరదలా పారుతోంది.
- గుండ్రాంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలు వచ్చినప్పుడు తరగతి గదుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది.

నూతన భవనాన్ని నిర్మించాలి



వెంబావి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాల పైకప్పు పెచ్చులూడిపోతోంది. విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నూతన పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలి.

–పాముసగుళ్ల వెంకన్న, ఎస్ఎంసీ చైర్మన్, వెంబావి

- సుంకెనెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- వెలిమినేడులోని బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేవు.
- ఆరెగూడెం యూపీఎస్‌లోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన గేటు వద్ద అతి తక్కువ ఎత్తులోంచి విద్యుత్ తీగలు వెళుతున్నాయి.

సీఎం కేసీఆర్‌తోనే సమగ్రాభివృద్ధి



కేతేపల్లి : సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి : ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని కొండకిందిగూడెం, తుంగతుర్తి, కొత్తపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు సోమవారం వారు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని అన్నారు. రైతులు ఇబ్బందులు పడొద్దని 24 గంటల ఉచిత కరెంట్, రైతు బీమా, రైతుబంధు పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కేతేపల్లి జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలత సురేష్, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్, బడుగుల శ్రీనివాస్‌యాదవ్, గోలి మంజుల వేణుమాధవరెడ్డి, కొండ సరితసైదులు, బచ్చు జానకిరాములు, కట్ట శ్రవణ్, ఎంపీటీసీ దాచేపల్లి నర్మద, పీసీఏసీఎస్ డైరెక్టర్ అలుగుబెల్లి సంజీవరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు బంటు మహేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిమట వెంకన్న పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు

పేదల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని కొండకిందిగూడెం, కొత్తపేట గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన 200 మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

పనుల పరిశీలన

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలో రూ.32 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ఆస్పత్రి భవనం పనులను సోమవారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని ఒకటో వార్డు పానగల్‌కు చెందిన గుడిసె ఎల్లయ్య కుటుంబానికి సోమవారం బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజుయాదవ్ రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు తనవంతు సహాయసహకారాలు అందించి వారికి అండగా ఉంటానని తెలిపారు. తన ఫౌండేషన్ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు సేవచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ నాగరాజు, పిల్లి జనార్దన్, లింగస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పరడ సర్పంచ్ పుట్ట సృజనవెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పరడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఎస్‌పీటీ ప్లాటీనం సహకారంతో రూ.1.80 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదిని క్లబ్ గవర్నర్ తీగల మోహన్ రావుతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. చెరిపల్లి లింగయ్య–అంతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు సత్తయ్య, యాదగిరి, పాండరి, కృష్ణయ్య, నర్సయ్యలు అదనపు గది నిర్మించినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి చేయూత ఇవ్వడంతోపాటు భవనానికి రంగులు వేయించిన క్లబ్ సభ్యులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఎంజేఎఫ్ అతిథులు యారాల ప్రభాకర్‌రెడ్డి, నంభూరి ప్రసాద్, ఎంఈఓ మేక నాగయ్య, ఎంపీటీసీ ఎడ్ల పురుషోత్తంరెడ్డి, హెచ్ఎం పల్లి సాయిలు, ఉపాధ్యాయుడు రామకోటి, శ్రీనివాస్, క్లబ్ సభ్యులు మిర్యాల యాదగిరి, జెల్లా గణేశ్, చెరిపల్లి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, గుర్రం శ్రీనివాస్, గంజి స్వామిగౌడ్, ప్రసాద్, మురళీమోహన్, రమేష్ ఉన్నారు.



అదనపు తరగతి గదిని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మోహన్‌రావు

విద్యుత్ సమస్యలపై కాంగ్రెస్ నాయకుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న దైద రవీందర్

నకిరేకల్ : వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ నకిరేకల్‌లోని విద్యుత్ ఏడీఏ కార్యాలయం ఎదుట సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు దైద రవీందర్ మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండలాల్లో లోఓల్టేజీ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం విద్యుత్ డీఈ శంకరయ్య, ఏడీ శ్రీకాంత్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్య, దైద స్వప్న, నాయకులు అలుగుబెల్లి మహిందర్‌రెడ్డి, రెడ్డిపల్లి సాగర్, ముద్దం విజయ్, స్వామి, జటంగి ముత్తయ్య, చెరుకు యాదగిరి, ధనమ్మ, చింతల శ్రీనివాస్, వంటెపాక సతీష్, చెరుపల్లి సైదులు, పశుపతి, పందిరి సతీష్, మహేష్ తదితరులు ఉన్నారు.

రసాయన పరిశ్రమల నిర్మాణాన్ని అడ్డుకోవాలి

మునుగోడు : ప్రజల ప్రాణాలను హరించే ఫార్మా కంపెనీల నిర్మాణాలను రాజకీయాలకతీతంగా అడ్డుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఫార్మా కంపెనీ వ్యతిరేక మహాధర్నా కరపత్రాన్ని అఖిలపక్ష ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమైన మునుగోడులో 60 సంవత్సరాలుగా కనీసం తాగునీరు లేక వేలాదిమంది అంగవైకల్యం తదితర వ్యాధిగ్రస్తులుగా మారారని అన్నారు. ఇప్పుడు ఫార్మా పరిశ్రమల నిర్మాణంతో ప్రజలు అనేక రోగాల బారిన పడక తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 16న జరిగే మహాధర్నాలో రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.స ఫార్మా వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, మునుగోడు సర్పంచ్ మిర్యాల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల నాయకుడు అంజయ్య గౌడ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచంద్రం, బీఆర్ఎస్ మండల నాయకులు పోలగోని సైదులు గౌడ్, ఇప్పర్తి సర్పంచ్ బొజ్జ శ్రీను, యాదయ్య, బొలుగురి లింగయ్య, బాబు, వెంకటేశ్వర్లు, నరసింహ, కైలాస్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న నెల్లికంటి సత్యం

ముగిసిన రుద్ర మహాయజ్ఞం



మాట్లాడుతున్న స్వామీజీ

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామిజీ ఆశ్రమంలో ఆశ్రమ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 7న ప్రారంభమైన పంచాహ్నిక ఏకాదశ పాశుపతాస్త్ర రుద్ర మహాయజ్ఞాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీ శంకరానందగిరి స్వామీజీ మాట్లాడుతూ లోక కల్యాణం కోసం రుద్ర మహాయజ్ఞం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పెరిక ఉమామహేశ్వర్, పడిదల నవీన్‌కుమార్, రమేష్‌రెడ్డి, నగేష్, జనార్దన్‌రెడ్డి, కిరణ్, గణేశ్, ఉపేందర్, వెంకన్న, మహేష్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

యువమోర్చా అధ్యక్షుడిగా బసవోజు వినోద్

కట్టంగూర్ : బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన బసవోజు వినోద్‌ను నియమిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు నూకల సుధాకర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ మండలంలో బీజేపీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు.

సివిల్ సప్లయ్ లారీల్లో డీజిల్ చోరీ

నాంపల్లి : కంచే చేను మేసింది అనే చందంగా మారింది సివిల్ సప్లయ్ సిబ్బంది పని తీరు. ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ బియ్యాన్ని ప్రతినెలా ఓ కాంట్రాక్ట్ ద్వారా లారీల్లో గ్రామాల్లోని రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తోంది. అయితే ఆ లారీల్లోని డీజిల్ మధ్యలో నిలిపి చోరీ చేస్తున్నారు డ్రైవర్లు. సోమవారం నాంపల్లి గ్రామ శివారులో కేతపల్లి రోడ్డులో సివిల్ సప్లయ్‌కి చెందిన రెండు లారీలను నిలిపి క్యాన్లల్లో డీజిల్ తీస్తున్నారు. గమనించిన కేతపల్లి గ్రామస్తుడు లారీ నుంచి డీజిల్ ఎందుకు తీస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే వారు డీజిల్ క్యాన్‌ను బైక్‌పై తీసుకొని అక్కడినుంచి వెళ్లారు. అనంతరం లారీ డ్రైవర్లు లారీలను తీసుకుని వెళ్లిపోయారు. లారీల డ్రైవర్లు డీజిల్‌నే దొంగిలిస్తే టన్నుల కొద్దీ ప్రభుత్వం రేషన్ బియ్యం పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు సివిల్ సప్లయ్ బియ్యం సరఫరా, పంపిణీపై దృష్టి సారించి పేద ప్రజలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ట్యాంకులో నుంచి డీజిల్ తీస్తున్న డ్రైవర్లు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైవే దిగ్బంధం

చిట్యాల : ఎస్సీ వర్గకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ(మహాజన సోషలిస్ట్ పార్టీ) ఆధ్వర్యంలో చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో హైవే దిగ్బంధం చేపట్టారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని హైవే రోడ్డు దిగ్బంధం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను అదుపులోకి తీసుకుని చిట్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మహాజన సోషలిస్ట్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి శంకర్‌మాదిగ, బకరం శ్రీనివాస్ మాదిగ, బొజ్జ చిన్న, ఎరసాని గోపాల్, సోముల పురుషోత్తం, పెరిక లింగస్వామి, బొజ్జ దేవయ్య, బుస్సు శ్రీనివాస్, బుస్సు మధు, కాసర్ల శివశంకర్, కాసర్ల నాగేంద్రవర్మ, పోలె స్వామి ఉన్నారు.

ఎస్పీ పర్యవేక్షణ

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైవే రోడ్డు దిగ్బంధం నేపథ్యంలో ఎస్పీ అపూర్వరావు చిట్యాలలో హైవే రోడ్డును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చిట్యాలలో పోలీసులతో మాట్లాడి వివరాలు సేకరించారు. హైవే రోడ్డుపై వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



నకిరేకల్ : పోలీసుల అదుపులో నేతలు

ఎమ్మార్పీఎస్ నాయకుల అరెస్టు

రామగిరి(నల్లగొండ) : ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా సోమవారం జాతీయ రహదారి దిగ్బంధం చేయనున్నారనే సమాచారంతో తిప్పర్తికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులను ఆదివారం రాత్రి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు ఊదరి నవీన్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌చంద్, దేవరకొండ సాయికుమార్, దేవరకొండ భాను, దారమళ్ల రాకేష్, కిన్నెర విజ్ఞాన్, కొండేటి హరికృష్ణలు ఉన్నారు.



చిట్యాల పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ

నకిరేకల్ : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ సోమవారం హైవే దిగ్బంధం నేపథ్యంలో ముందస్తుగా నకిరేకల్‌లో పలువురు ఎమ్మార్పీఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మాచర్ల సైదులుమాదిగ, కందికంటి యాదగిరి, మాచర్ల సుదర్శన్, చిట్టిపాక విజయ్, కొత్తపల్లి సైదులు, గాదె రాజు, పాలడుగు యేసయ్య, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' ను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తిరుమలరాయునిగూడెం సర్పంచ్ గౌర వీరయ్య, ఎంపీటీసీ జోగు సైదమ్మ అన్నారు. సోమవారం గ్రామంలో కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. 18 సంవత్సరాల వయస్సు నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వెంకన్న, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

14వ వార్డులో కంటి వెలుగు శిబిరం

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 14వ వార్డు మర్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు శిబిరం మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు పరిధిలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.



శాలిగౌరారం : తిరుమలరాయునిగూడెంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నాణ్యమైన భోజనం అందించాలి

కేతేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని చీకటిగూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వరావు కోరారు. మండలంలోని చీకటిగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో కూర్చుని కొద్దిసేపు పాఠం విన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వంట వండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం సుశీల, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ గీత, బీఆర్ఎస్ నాయకుడు బొజ్జ సతీష్ తదితరులు ఉన్నారు.

బీసీ జన గణన చేపట్టాలని సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

రామగిరి(నల్లగొండ) : దేశవ్యాప్తంగా బీసీల జన గణన చేపట్టి రిజర్వేషన్‌ను 52 శాతానికి పెంచాలని కోరుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పిలుపు మేరకు బీఎస్పీ నాయకులు తిప్పర్తి మండల కేంద్రంలో సోమవారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ పంబాల అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటెపాక యాదగిరి మాట్లాడుతూ కాన్షీరాం బీసీల హక్కుల కోసం బీఎస్పీని స్థాపించగా, ఆయన ఆశయ సాధనలో డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పయనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ తిప్పర్తి మండల అధ్యక్షుడు పేరపాక లింగస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కోడి భీంప్రసాద్, కోసుకొండ కవిత, అంకెపాక శ్రీనివాస్, దున్న లింగస్వామి, దాసారపు రవితేజ, పల్లె ప్రభాకర్, దాసరపు నవీన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్యాల : కుల వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి సంఘం నాయకులు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా నాయకుడు అవిశెట్టి శంకరయ్య అన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం చిట్యాలలో వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు అక్కెనపల్లి నాగయ్య, ఐతరాజు యాదయ్య, రుద్రారపు పెద్దులు, పాలమాకుల అర్జున్, నలపరాజు శేఖర్, కడగంచి నర్సింహ, నాగయ్య పాల్గొన్నారు.

అసంపూర్తిగా కొండూరు బస్ షెల్టర్

మర్రిగూడ : మండలంలోని కొండూరు గ్రామంలో పాతికేళ్ల క్రితం బస్ షెల్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. బస్‌షెల్టర్‌కు ప్లాస్టింగ్ చేయకపోవడం తోపాటు లోతట్టు ప్రాంతంలో నిర్మించడంతో వర్షపు నీరు బస్ షెల్టర్‌లోకి ప్రవహించేది. బస్ షెల్టర్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటుంది. అయినా అసంపూర్తిగానే ఉండిపోయింది. మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తెస్తారో, లేదా మరో నూతన బస్ షెల్టర్‌ను నిర్మిస్తారో అధికారులు స్పందించి చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల లోతట్టు ప్రాంతంలో గ్రామపంచాయతీ నిధులతో మట్టి పోయించారు.



పాతికేళ్లుగా అసంపూర్తిగా ఉన్న బస్ షెల్టర్

'అప్పుల రాష్ట్రంగా మార్చిన కేసీఆర్'

నల్లగొండ రూరల్ : మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కనగల్ మండలం కురంపల్లిలో బలుగూరి రాంబాబు గౌడ్ అధ్యక్షతన జరిగిన ప్రజాగోస–బీజేపీ భరోసా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, కేజీ నుంచి పీజీ విద్య, ఉచిత ఎరువులు, ప్రతి నియోజకవర్గానికి కాలేజీ, 100 పడకల ఆస్పత్రి హామీలు ఇచ్చిన కేసీఆర్.. వాటిని అమలు చేయలేదన్నారు. భిక్షం, ప్రవీణ్, కనకయ్య, శంకర్, కిరణ్, శ్రీను, శ్రీశైలం, రమేష్, హరిబాబు, మహేందర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

శాలిగౌరారం : మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో మంగళవారం నుంచి ఈ నెల 16 వరకు బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ అల్లి సైదులు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ నిధులు రూ.40 లక్షలతో పునర్నిర్మించిన శివాలయ ప్రారంభోత్సవాన్ని కూడా ఉత్సవ కమిటీ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేడుకలను అంగరంగ వైభంగా నిర్వహిస్తున్నామని భక్తులు ఈ వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సర్పంచ్ కోరారు.

ఆర్టీసీ కళాజాతా

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం శ్రీదేవి అన్నారు. సోమవారం నల్లగొండ బస్టాండ్‌లో ఆర్టీసీ కళాకారులు నిర్వహించిన కళాజాతాలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అందించే కార్గో సేవలు, వివాహాలకు, ఇతర కార్యక్రమాలకు రాయితీపై ఇచ్చే బస్సుల వివరాలను కళాజాతా బృందం తెలియజేశారు. ఈ కార్యక్రమలో డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం